# ఐడియాల అప్పారావు



-మేడేపల్లి రంగవల్లి

"ఏవిటి గురుమూర్తీ దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?" ఏదో ప్రకటనని అనుకరిస్తూ అడిగాడు అప్పారావు గురుమూర్తిని.

"ఏం లేదు అప్పారావూ...మా మాంగారు సతీసమేతంగా దిగి పదిహేనురోజులుంటాట్ట. నిన్ననే అందింది వర్తమానం" నీరసంగా అన్నాడు గురుమూర్తి.

"అయితే ఏం సంతోషమేగా?" ప్రశ్నార్థకంగా ఫేసుపెట్టి అడిగాడు అప్పారావు.

"ఏం సంతోషం? బడ్జెట్‌కి గండి పడ్తోంటే. ఏదో నా జీతంతో బొటాబొటీ మేం నలుగురం అయితే బ్రతికేస్తాం. కానీ ఇంకో ఇద్దర్ని అదీ సగం నెల ఎలా భరాయించడం?" ఢీలా పడిపోయిన ముఖంతో అన్నాడు గురుమూర్తి.

"అదీ నిజమే. అవును గురుమూర్తీ. మీ ఆవిడ రకరకాల కుట్లు నేర్చుకుందన్నావు కదా! ఈరోజుల్లో చీరల మీద ఎంబ్రాయిడరీ చాలా ఫ్యాషన్. పట్టుచీరలు కూడా మానేసి డబ్బున్నోళ్ళు కూడా ఈ చీరలే కడుతున్నారు. మీ ఆవిడ చేత చేయించొచ్చు కదా. నాలుగు డబ్బులొస్తాయి" అన్నాడు అప్పారావు.

"మాంచి ఐడియా ఇచ్చావు తప్పకుండా అమలుచేస్తా" హుషారుగా వెళ్ళిపోయాడు గురుమూర్తి. ఇంటికెళ్తూనే ఈ ఐడియాని భార్య భవానికి చెప్పాడు గురుమూర్తి.

"పిల్లలు స్కూల్‌కెళ్ళిపోతే నాకేం పనిలేక బోర్ కొడుతోందండీ. ఈ ఐడియా బాగుందండీ. నేను దాచుకున్న డబ్బు ఓ ఐదొందలుంది. కావలసిన సరంజామా రేపు బజారుకెళ్ళి తీసుకురండి" అంది భవానీ. అంతే! రెండునెలల్లో బోలెడు ఆర్డర్లు వచ్చాయి. చీరకి రెండుమూడొందలు చొప్పున వర్క్‌ని బట్టీ తీసుకుని చాలా లాభం అర్జించింది భవానీ. ఆర్నెళ్లకి మోపెడ్ నడిపే గురుమూర్తి కాస్తా మోటార్‌సైకిల్ ఓనరుడయ్యాడు.

మోటార్‌సైకిల్‌ని పార్క్ చేసి ఆఫీసులోకి వస్తోన్న గురుమూర్తిని చూపిస్తూ టైపిస్ట్ మోహన్రావు-

"చూడు అప్పారావు! గురుమూర్తి దర్జా. బికారిలా ఉండే వాడు నవాబులా తయారయ్యాడు. కాలమహిమ! కిటుకేమిటంటావు? నేనూ ఉన్నాను. నలుగురు పిల్లలు చాలీచాలని జీతం. ఈరోజు కూరుంటే రేపు ఉండదు. పచ్చటిమెతుకులు తినే బ్రతుకులు మావి వ్చ్.." నిట్టూర్చుతూ అన్నాడు.

"మోహన్ మీ ఆవిడ బిఏ చదివింది కదా. అంతో ఇంతో ఇంగ్లీష్ ముక్కలొచ్చు కదా ఎల్ఐసీ ఏజెన్సీ తీసుకోకూడదూ. ఏదో వేణ్ణీళ్ళకి చన్నీళ్ళు. అప్పుడిలా నిట్టూర్చక్కర్లేదు నువ్వు" మోహన్‌రావు భుజం తడుతూ అన్నాడు అప్పారావు.

మర్నాడే సెలవుపెట్టి భార్య సుశీలని తనకు తెలిసున్న టావ్‌వన్ ఏజెంట్ వద్దకు తీసుకువెళ్ళి ఫార్మాలిటీస్ తెలుసుకుని ఆఫీసర్ల కాళ్లావేళ్లాపడి ఏజెన్సీ తెచ్చుకున్నాడు మోహన్రావు.

మరో ఆరునెలల్లో మోహన్రావు తీరే మారిపోయింది. టకప్, ఖరీదైన షూ, మెళ్ళో చైన్.

"ఏంటి సోమేష్. మోహన్రావునలా కన్నార్పకుండా చూస్తున్నావు?" ఫ్యూన్ భుజం తడుతూ అడిగాడు అప్పుడే ఆఫీసులోకి వస్తూ అప్పారావు.

"ఏం లేద్సార్. ఆరునెలల క్రితం పదీ పరకా నన్ను చేబదుళ్ళడిగే ఈ మోహన్రావు సార్ ఇప్పుడు నాకే అప్పిచ్చేలా కనబడుతున్నాడు. నసీబ్ సార్" నుదుటికడ్డంగా బొటనవేలితో రాస్తూ అన్నాడు సోమేష్.

"చూడుసోమూ. ఇలా చేబదుళ్ళుకాదోయ్. నువ్వనవసరంగా మిగిలే డబ్బంతా ఫిక్స్‌డ్ చేస్తూపోతే ఏం లాభం? ఆ డబ్బుని వడ్డీకి తిప్పితే నీకు వద్దంటే డబ్బు. అసలు అసలుగా ఉంటుంది. వడ్డీ నీకు ఆదాయం. బ్యాంక్‌లో ఏం వడ్డీ చెప్పు? ఇదే లాభం నీకు. అంతేకాదు నాలాంటివాళ్లకు పరోపకారం కూడాను" అనేసి తన సీట్లోకి వెళ్ళిపోయాడు.

అంతే ఫ్యూన్ సోమేశం వడ్డీల సోమేశంగా మారిపోయాడు. ఆఫీసులో అతనికున్న వాల్యూ ఆఫీసర్క్కూడా లేదు. దగ్గర దగ్గర రెండుమూడులక్షలు వడ్డీలకు తిప్పుతూ ఆరునెలల్లో ఒక జాగా కూడా వాయిదాల పద్ధతిన కొన్నాడు.

ఓరోజు రాత్రి అన్నం కలుపుకుంటూ "చూడు పావనీ! నా కళ్లముందే అందరూ నా ఐడియాలతో ఎంత ఎదిగిపోయారో చూడు. మనం మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉన్నాం. ఏదో ఉబుసుపోక వాళ్లకిచ్చిన ఐడియాలు ఎలా వర్కవుట్ అయ్యాయో చూడు వాళ్లకి" అసూయ పైకి కనబడకుండా జాగ్రత్తపడి భార్యతో అన్నాడు అప్పారావు.

"మీరలా నోరెళ్లబెట్టుకుని వాళ్లని చూడకపోతే మీరే మీ ఐడియాలని ఆచరించి ఎదిగిపోవచ్చును కదా!" జ్ఞానోపదేశం చేసింది భార్య పావని.

అవును నిజమే సుమీ! నాకీ ఐడియా ఇంతవరకూ రానేలేదు. మనకిప్పుడు రోజులు బాగానే ఉన్నాయనుకో. రేప్రొద్దున్న పిల్లలు ఎదుగుతారు. ఖర్చులూ పెరుగుతాయి. వాళ్లకి కావాల్సిన ఖర్చులు పెట్టాలంటే వేలకి వేలు కావాల్సి వస్తుంది. ఇప్పట్నుంచే సంపాదించాలి దాచాలి. ఏదో ఒకటీ చేయాలి. ఏం చేద్దాం... ఆలోచనలో పడ్డాడు అప్పారావు.

అప్పారావు ఆ ఊరి ఆఫీసుకి ఏడేళ్లక్రితం వచ్చాడు వైజాగ్ నుంచీ. పంతొమ్మిదేళ్ళకే టెస్ట్‌ల్లో ఫస్ట్ వచ్చి ఆ ఉద్యోగం సంపాదించి అంచెలంచెలుగా ఎదిగాడు. జె.ఏ నుంచి అకౌంటెంట్ అయ్యాడు. ఐదంకెల జీతంతో ఆనందంగానే ఉన్నాడు. తల్లి, భార్య, ఇద్దరు పిల్లలతో కాలం బాగానే వెళ్తోంది. వైజాగ్‌లో తండ్రి కట్టిచ్చిన ఇంటికి అద్దె రెండువేలు వస్తుంది కూడా.

అప్పర్ మిడిల్‌క్లాస్ అయినా మిడిల్‌క్లాస్‌కి దిగువకెళ్లి డబ్బు అదనంగా ఎలా సంపాదించాలా అని ఆలోచించాడు. 'ఇదుంది కానీ ఏం లాభం. ఎప్పుడో చిన్నప్పుడు అత్త చనిపోతూ తీసుకున్న మాటకోసం అంటగట్టారు. అక్షరం ముక్క లేదు. అణా సంపాదన లేదు. ఏదీ రాదు ఎంతసేపూ వంటింట్లోనే పడేడుస్తుంది ఖర్మ' మనసులో చికాకు పడ్తూ పలువిధాల వాపోతున్నాడు భార్య గురించీ.

ఆరోజు ప్రొద్దున్నే పేపర్ పట్టుకుని కూర్చున్న అప్పారావుని ఓ ప్రకటన ఆకర్షించింది.

'నెలరోజుల్లో లక్షాధికారి కాదలచుకున్నారా?' అంటూ మొదలైన ఆ ప్రకటనను ఆసాంతం చదివి ఈలవేస్తూ ల్యాండ్‌లైన్ ఫోన్‌ను ఒళ్ళో పెట్టుకు కూర్చుని నెంబర్ తిప్పాడు. అవతల ఓ ఆడగొంతు "డకోటా కంపెనీ లిమిటెడ్ కెన్ ఐ హెల్ప్‌యూ" అంది స్వీట్‌గా.

"ఎస్ ప్లీజ్" అని ఇన్‌ఫర్మేషన్ అంతా గేదర్ చేసి నోట్ చేసుకున్నాడు.


ఆఫీసుకి సెలవుపెట్టి డకోటా కంపెనీ ఆఫీస్‌కి వెళ్లాడు. ముందురోజే జీతం రావడంతో అక్కడ

కట్టాల్సిన డిపాజిట్ కట్టి కొన్ని వస్తువులు ఇంటికి తెచ్చాడు. ఇంతకీ అదేంటంటే అప్పారావు డకోటా ప్రొడక్ట్సుకి సేల్స్ ఏజెంట్ అన్నమాట. వారానికి ఇద్దరు చొప్పున, ఆ ఇద్దరు చెరో ఇద్దరు చొప్పున ఇలా నెల తిరిగేసరికి కస్టమర్స్ దాదాపు 48కి పైన అవ్వాలి. వాళ్లందరి డిపాజిట్స్‌లోనూ ఇతనికి ఇంట్రడ్యూసర్‌గా రాయల్టీ వస్తుంది. ఈ ప్రొడక్ట్సుని అతడు అమ్మాలి. అందులో సగం లాభమూ అతనిదే. వాటి ఖరీదులు రెండు టూత్‌బ్రష్‌లు వందరూపాయలు. ఒక బాత్‌పౌడర్ టిన్ రెండువందల యాభై. జుత్తును నల్లబరిచే ఆయిల్ నాలుగువందలు ఇలా.. సాయంత్రానికల్లా పావని పిల్చిన చుట్టుపక్కల అమ్మలక్కలంతా అప్పారావు ఇంట్లో పోగయ్యారు. అప్పారావు వీరలెవెల్లో డిమాన్‌స్ట్రేట్ చేశాడు. ఆ వస్తువుల పుట్టుపూర్వోత్తరాలన్నీ ఏకరవుపెట్టాడు. "పట్టుమని పదిరూపాయలైనా ఉండని పళ్లుతోముకునే బ్రష్ యాభైరూపాయలా?"

పక్కింటి పార్వతమ్మ విస్తుపోతూ అని జారుకుంది.

"పావు మినుములు, పావు పెసలతో ఆడిస్తే వచ్చే సున్నిపిండి, బాత్‌పౌడర్ రెండువందల యాభై" ముక్కున వేలేసుకుంటూ మీనాక్షమ్మ బైటికి దారితీసింది.

"ఏడురూపాయలు పెడ్తే జుత్తంతా నల్లనౌతుంది దానికోసం నాలుగువందలు" బుగ్గలు నొక్కుకుంటూ వర్ధనమ్మ ఇంటితోవ పట్టింది. అలా అమ్మలక్కలంతా వెళ్ళిపోయారు. ఒక్క ప్రోడక్ట్ కూడా అమ్ముడుపోలేదు. ఎవ్వరూ జాయిన్‌కాలేదు. ఆ ఫోర్స్‌తోనే ఆఫీసులోనూ చెప్పిచూశాడు. అక్కడా రెస్పాన్స్ శూన్యం. ఆ ప్రోడక్ట్స్ ఇచ్చేసి నేను చేయలేనని చెప్పి డబ్బు తీసుకోబోతే 'డిపాజిట్ తిరిగి ఇవ్వబడదు అన్న కాంట్రాక్ట్ మీద సంతకం చేసే వస్తువులు పట్టుకెళ్లారు కదాసర్' అన్నాడు అక్కడి వర్కర్. ఉసూరుమంటూ కాళ్ళీడ్చుకుని ఇంటికి వచ్చాడు.



మర్నాడు ఆఫీసులో ఢీలాగా ఉన్న అప్పారావుని చూసి మోహన్‌రావు పలకరించాడు.

"ఏంటి అప్పారావూ. ఎప్పుడూ నవ్వుతూ హుషారుగా ఉంటావు కదా. రెండుమూడురోజుల్నుంచీ ఢీలాగా కనబడుతున్నావు ఏంటి సంగతి?"

"ఏంలేదు మోహన్. పిల్లలు ఎదుగుతున్నారు కదా ఏదో ఒకటి చేసి డబ్బు సంపాదిద్దామనుకుని ఓ బిజినెస్ మొదలుపెడితే అది ఆదిలోనే బెడిసికొట్టింది. మొన్నటికి మొన్న మా అమ్మ తీరి కూర్చుని బూజు దులపబోయి స్టూలు కదిలి క్రిందపడి కాలు విరగ్గొట్టుకుంది. మా బుజ్జిగాడికేమో అస్తమానూ ఏవో కంప్లైంట్లు. ఇలా అనుకోని ఖర్చులెదురైతే ఎలా చెప్పు?"

"ఆపద్బాంధవుడిలా సోమేశం ఉన్నాడు కదా"

"తీర్చుకోవద్దూ? వందకి మూడురూపాయలు వడ్డీ ఇచ్చుకోవాలి. మళ్లీ తీర్చేదారేదీ?" ఏం లాభం లేదన్నట్టు అన్నాడు.

"మాకందరికీ ఐడియాలిస్తావు నీకు తెలీదా ఏదో ఐడియా వెయ్యి"

## కలిసొచ్చిన కాలం



'జయం' స్ఫూర్తి సదాకి బాగానే కలిసొచ్చింది. కొన్ని చిత్రాలు ఎలాంటి అదృష్టాన్ని తెచ్చిపెడతాయో ఎవరికీ తెలియదు. 'అపరిచితుడు' చిత్రంతో అందర్నీ అలరించిన విక్రమ్‌తో పాటూ ఆ చిత్రంలో హీరోయిన్‌గా నటించిన సదా కూడా అదృష్టాన్ని చేజిక్కించుకుంది. ఇప్పుడీ భామ రెండుచిత్రాల్లో నటిస్తోంది. 'ఇప్పుడే నా కెరీర్ ఓ గాడిలో పడుతోంది. మంచి చిత్రాల ఎంపికతో ఆ గాడి తప్పకుండా చూసుకుంటాను' అని ఆత్మవిశ్వాసంతో చెబుతున్న సదా బాలకృష్ణతో పాటూ 'నువ్వొస్తానంటే నేనొద్దంటానా' హీరో సిద్ధార్థ్‌తో కలిసి నటిస్తోంది. మొత్తానికి సదా ఇప్పుడు లక్కీగర్ల్‌గా మారిందన్నమాట.




"అదే ఏం చేద్దామన్నా మా ఆవిడ తరఫునుంచీ శూన్యం. ఏ తర్జనభర్జనలన్నా నేనే పడాలి. ఏం చేయాలో అర్ధంకావడం లేదు"

"చదువులేకపోతేనేం మీ ఆవిడ పచ్చళ్ళు బాగా పెడుతుంది కదా. ఆమధ్య వేసవిలో ఆవకాయ ఇచ్చావు కదా. చాలా టేస్టీగా ఉంది. పచ్చళ్ళు పెట్టించు" అని మోహన్‌రావు సలహా ఇచ్చి తన సీట్లోకి వెళ్ళిపోయాడు.

అప్పారావు కళ్ళు మెరిశాయి. నిజమే పిచ్చిది. చదువులేదుగానీ వంటలు బాగా చేస్తుంది. పచ్చళ్ళు యమటేస్ట్‌గా పెడ్తుంది. పెళ్లాం చదువు రానిదని తనకున్న గీర్వాణం అంతా పోయి ఆమె మీద బోలెడంత ప్రేమ కలిగింది. ఇంటికి వెళ్తూ జిలేబీలు, మిక్చర్, సన్నజాజిపూలు పట్టుకెళ్లాడు హుషారుగా.

అందరూ నిద్దరోయాకా పెళ్లాం పక్కచేరి "పావనీ మరేం మనమూ ఎదగడానికి నాకో ఐడియా వచ్చిందే!" అన్నాడు.

"ఏంటండీ అదీ!" అలర్ట్ అయ్యి భర్తవైపు తిరుగుతూ ఉత్సాహంగా అంది పావని.

"ఏంలేదు. నువ్వు చక్కగా పచ్చళ్ళు పెడ్తావు కదా మనం పచ్చళ్ళ బిజినెస్ పెడితే?"

"బాగుందండీ. అలాగే చేద్దాం" అని ఆనందంగా ఒదిగిపోయింది అప్పారావు కౌగిట్లో పావని. ముందురోజే జీతం అందిందేమో టమాటాల కాలం కావడంతో తెల్లారుతూనే రైతుబజార్ కెళ్లి ఓ ఇరవై కిలోల టమాటాలు, మిగిలిన సరంజామా అంతా టమాటా పచ్చడికని పట్టుకొచ్చాడు. పదిరోజుల్లో సువాసనలు వెదజల్లే టమాటా పచ్చడి సిద్ధమైంది. చిన్న చిన్న పాలిథీన్ ప్యాకెట్లలో కట్టి ప్యాకెట్ పదిరూపాయల క్రింద ఇంటి వద్దా, ఆఫీసులోనూ, తెలిసిన వాళ్లకూ అమ్మేడు. ఖర్చులుపోనూ రెండుమూడు వందలు మిగిలాయి. ఎవరో పెళ్లిపార్టీ వాళ్ళు ఈ పచ్చడి నచ్చి ముప్ఫై కేజీలు ఆర్డర్ ఇచ్చారు. అడ్వాన్స్ తీసుకుని ఎడాపెడా సరంజామా కొని ఆదరాబాదరా పచ్చడి పెట్టేసి ప్లాస్టిక్ డబ్బాల్లోకెత్తి సరఫరా చేసేశాడు. డబ్బు మొత్తం తీసుకున్నాడు. ఆరోజు ఆఫీసునుంచీ ఇంటికెళ్ళేసరికి ఇంటిముందో కారు, ఇంట్లో నుంచీ ఏవో అరుపులు.. హడావిడిగా ఇంట్లోకి వెళ్లాడు.

"ఒకటా రెండా ముప్ఫైకేజీలు గోతిలో పోయాల్సొచ్చింది. పెట్టి పదిరోజులన్నా కాలేదు. మొత్తం బూజు...ఎవరబ్బసొమ్మని" ఒక ఆసామీ గట్టిగా కేకలేస్తున్నాడు.

"ఏమైంది సార్" దగ్గరగా వెళ్లి మెల్లగా అన్నాడు.

"ఏమవ్వాలి? మీరిచ్చిన పచ్చడి మొత్తం పెళ్లిలో వడ్డించేసరికీ బూజెక్కి కూర్చుంది. మా ఇంట్లో ఏ పచ్చడీ ఏళ్లతరబడీ బూజెక్కి ఎరగదు. మీది మొత్తం తగలడింది. టైం లేక మీ కప్పగిస్తే మా బాగా పెట్టారు ఎంత డబ్బు పోశామని" హుంకరిస్తూ అన్నాడు.

"మొత్తం బూజెక్కిందేవిటి?"

"ఆఁ చూడండి. మీకు చూపుదామనే ఈ మూడో డబ్బాని తెచ్చాను" చికాగ్గా మూతతీసి చూపించాడు ఆయన.

"ఎలా జరిగిందబ్బా. తడిచేతులు పెట్టారేమో" అన్నాడు నాన్చుతూ.

"ఇదినిండుగా ఉందికదా. మీ ఎదటే మూతతీశాను కదా!" చాలా చికాగ్గా అన్నాడతను.

"సరేసార్ గొడవెందుకు? మీ డబ్బు మొత్తం మీకిస్తాను. గొడవచెయ్యకండి దయచేసి.." అని ఆరోజే వచ్చిన జీతంలో సగం ఇచ్చేసి ఏడుపుముఖం పెట్టాడు అప్పారావు భార్యవైపు నిస్సహాయంగా చూస్తూ.

"నెలరోజులుగా పెడ్తున్నావు ఏ ఒక్కరినించీ బ్యాడ్‌రిమార్క్ రాలేదు. మరి వీడికిచ్చిన పచ్చడి ఎలా పాడైందే?" అతను వెళ్ళాకా తలపట్టుక్కూర్చుని అడిగాడు.

"మీరేమీ అననంటే చెప్తానండీ. మన బుజ్జిగాడు ఎండేసిన పచ్చట్లో గ్లాసుతో నీళ్ళు పట్టుకెళ్ళి పోశాడండీ..." భయంభయంగా చెప్పింది.

"వాడుపోస్తే నువ్వు చోద్యం చూస్తూ మా బాబే అంటూ నించున్నావా?"

విసురుగా దగ్గరకొస్తూ అన్నాడు.

"రెండ్రోజులు ఎండితే బాగా ఆరిపోతుందిలే అని ఊరుకున్నానండీ" వెనక్కి జరిగి అంది.

"ఏడేవాడు నా లాభంలో నీళ్ళు పోసి ఎక్కడ దర్జా వెలగబెడుతున్నాడు బ్లడీ రాస్కెల్ చెమడాలెక్కగొట్టేయాలి వెధవకి" ఆవేశంగా వెళ్ళి వాడెక్కడున్నాడో వెతుక్కొచ్చి వీపుమీద నాలుగు పీకాడు. వాడు ఆరునొక్కరాగం అందుకున్నాడు.

"మూడేళ్ళ పసివాడు వాడికేం తెలుసని. ఆనక ఎండబెట్టాను. ఎండిపోయిందనుకున్నాను. ఎండలేదు. మన ప్రారబ్దం ఇంతేకానీ వాడినెందుకు కొడ్తారు? వాడికేం తెలుసని" కడకొంగు లాక్కుని ముక్కుచీదుతూ అంది పావని.

"వాడికి తెలీపోతే వాడ్ని జాగ్రత్తగా చూసుకోవాలని నీకు తెలీదా? ఎండబెట్టిందంట ఎండబెట్టింది. ఇదిగో ఈ సగం జీతంతోనే ఈనెల ఏడువ్. కట్టాల్సినవన్నీ కట్టి మిగిలింది తెచ్చాను. అందులో సగం...ఇలా తగలెట్టాల్సి వచ్చింది. ఇదిగో" అక్కడున్న కుర్చీలో మిగిలిన జీతం డబ్బులు పడేసి బయటికెళ్ళిపోయాడు కోపంగా. ఆ పచ్చడి విషయంలో జరిగిన అల్లరి అందరికీ తెలిసి ఆ తర్వాత పెట్టిన చింతకాయ పచ్చడి అంతా అలాగే ఉండిపోయింది. ఎవ్వరూ కొనలేదు.

ఓరోజు "ఏంటిసార్ డల్‌గా ఉన్నారు?" అడిగాడు సోమేశం అప్పారావుని.

"ఏం చెప్పను సోమేశం ఈ పచ్చళ్ళ బిజినెస్ కూడా బెడిసికొట్టింది. ఏం చేయాలో అర్థంకావడం లేదు. మునిగిపోయాను సోమేశం. ఓ మూడువేలివ్వు ఈ నెలకి సర్దుబాటుకి. నెలకీ వడ్డీ కరెక్ట్‌గా ఇచ్చేస్తాన్లే. తొందర్లో తీర్చేస్తా" అన్నాడు.

"తప్పకుండా సార్. కానీ ఈ బిజినెస్ మీతో రాణిస్తుందేమో. మీకీరోజే ఒక వ్యక్తిని పరిచయం చేస్తాను" అంటూ మూడువేలకు చెక్కిచ్చాడు.

"పెట్టుబడి లేని వ్యాపారం. చాకచక్యంతో మాట్లాడ్డమే దీనికి పెట్టుబడి. చక్కగా చేసుకుంటే, ఓపికగా తిరగగలిగితే సొమ్ములే సొమ్ములు" సోమేశం చూపించిన సైట్ల బ్రోకర్ సారీ సైట్ల వ్యాపారి అప్పారావుతో అన్నాడు.

అన్నీ వివరంగా చెప్పి "ఓ సెల్‌ఫోన్ కొనుక్కోండి సార్. టచ్‌లో ఉండడానికి వీలవుతుంది. చాలా అవసరం కూడాను" అని ఫినిషింగ్ టచ్ ఇచ్చి వదిలాడు. అప్పుల్లో అప్పు సోమేశాన్ని మరో మూడువేలడిగి సెల్‌ఫోన్ ఓనరుడయ్యాడు అప్పారావు. ఆ మర్నాడే ఫోన్ వచ్చింది. పార్టీ రెడీ అని సైట్ చూపించాలని. స్థలం కావాల్సిన పార్టీని తీసుకెళ్లి జాగా చూపించి దిక్కులు మూలలు వాస్తు అదీ చెప్పి మొత్తానికి ఒప్పించి స్థలం యజమాని వద్దకెళ్ళి అతనికీ, ఇతనికీ నచ్చజెప్పి ఒప్పించి ఇద్దరి వద్దా మొత్తం బ్రోకరేజి ముప్పై వేలు తీసుకుని వ్యాపారి వద్దకెళ్లి ఇచ్చి తన వాటా పదిహేనువేలు అందుకుని హుషారుగా బయల్దేరాడు. పాపకీ, బుజ్జిగాడికీ బొమ్మలు, భార్యకి ఓ చీర, స్వీట్లు పట్టుకుని ఆనందంగా ఇంట్లో అడుగుపెట్టాడు. అందరూ ఆనందంగా సినిమాకెళ్ళి, హోటల్లో భోజనం చేసి వచ్చారు. రెండ్రోజులు గడిచాయి. ఆ సైట్ల బ్రోకరు ఓ రోజు లబోదిబోమంటూ వెంటనే రమ్మని ఫోన్ చేస్తే ఏమైందని వెళ్లాడు. ఆ అమ్మించిన స్థలం యజమాని అతను కాదని ఆ డాక్యుమెంట్లు డమ్మీవనీ తేలిందనీ, కొన్నవాడు గొడవ చేశాడనీ మొత్తం బ్రోకరేజి ఇచ్చేయమన్నాడనీ తనవాటాకిచ్చిన డబ్బు ఇవ్వమనీ చెప్పాడు. అప్పటికి సోమేశం అప్పు ఆరువేలు తీర్చేసి మరో వెయ్యి అటూ ఇటూ ఖర్చుచేసేసిన అప్పారావు గుడ్లు తేలేశాడు.

అఱ్రీబఱ్రీగా సోమేశం దగ్గరకెళ్ళి ఏడువేలు మళ్లీ అప్పడిగి తనవద్దనున్న వాటితో కలిపి పదిహేనువేలూ తీసికెళ్ళి బ్రోకర్ చేతిలో పోసేసి ఆఫీసుకొచ్చి తలపట్టుక్కూర్చున్నాడు.

"ఏంటి అప్పారావూ ఇలా దిగాలుగా కూర్చున్నావూ? నీకు సీనియర్ అకౌంటెంట్‌గా ప్రమోషన్! మీ ఊరు వైజాగ్‌కి ట్రాన్స్‌ఫరైంది. హ్యాపీసే హ్యాపీస్. నీ పని బాగుందిలే" ఆఫీసర్‌గారు ఆర్డర్స్ ఇస్తూ అన్నాడు.

అందరూ షేక్‌హ్యాండ్లిచ్చి అభినందించారు. అప్పు ఎలాగైనా తీరుస్తానని సోమేశానికి హామీ ఇచ్చి ఆఫీసునుంచీ ఇంటి దారిపట్టాడు అప్పారావు.

భార్యకి ఆర్డర్స్ చూపించిన తర్వాత సైట్ల బిజినెస్‌లో తగిలిన దెబ్బ గురించీ చెప్పాడు.

"మనకిలాంటివి అచ్చిరావండీ. ఇక మీదట డబ్బు సంపాదన ఐడియాలు మాని వచ్చే డబ్బునే జాగ్రత్తచేయడం నేర్చుకుందాం. ఏదైనా మన మంచికే లెండి" అంటూ భర్తని ఓదార్చింది పావని.

★ ★ ★

డబ్బు ఇంకా ఇంకా సంపాదించేద్దాం. తక్కువ సమయంలో ధనవంతులమై పోదాం అనుకోవడం జబ్బు లాంటిది. ఎంత సంపాదించినా, ఎంత ఉన్నా ఇంకా సంపాదించేయాలనే ఉంటుంది. ఎక్కువ సంపాదించాలనీ, త్వరగా ఎదిగిపోవాలనీ...పెద్దపెద్ద అడుగులేస్తే అప్పారావులా బోర్లాపడకతప్పదు. వచ్చిన దాంట్లోనే ఎంతో సౌకర్యంగా, సుఖంగా బ్రతకడం నేర్చుకుంటే అందులోనే తృప్తిని పొందగలిగితే జీవితం ఆనందంగా ఆహ్లాదంగా గడుస్తుంది.

★

## ప్రోస్టేట్ క్యాన్సర్

పురుషుల లైంగిక వ్యవస్థలో ప్రోస్టేట్ గ్రంథి ప్రముఖ పాత్ర వహిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా పురుషులను బలిగొంటున్న క్యాన్సర్‌లలో ప్రోస్టేట్ క్యాన్సర్ మూడోస్థానం ఆక్రమిస్తోంది. యాభై ఏళ్ల వయస్సుపైబడిన పురుషుల్లో ప్రోస్టేట్ క్యాన్సర్ వచ్చే అవకాశాలు మరింత ఎక్కువని గణాంకాలు చెబుతున్నాయి. 50-59 మధ్య వయస్సున్న పురుషుల్లో ప్రోస్టేట్ క్యాన్సర్ అత్యధికంగా కనిపిస్తోంది. ఇదే వయస్సు గ్రూపులో ఉన్నవారు స్థూలకాయులైతే ఈ వ్యాధి వచ్చే అవకాశాలు 58 శాతం ఎక్కువ. మరో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే సాధారణ వ్యక్తులకన్నా ఎక్కువ ఎత్తున్నవారు ప్రోస్టేట్ క్యాన్సర్ బారినపడే అవకాశాలు మరింత పెరుగుతాయి. దీన్నిబట్టి ఈ వయస్సువారు ప్రోస్టేట్ క్యాన్సర్ బారినపడడానికి స్థూలకాయంతోపాటు పొడవు కూడా కారణమవుతుంది. నార్వే దేశానికి చెందిన పురుషులపై 21 సంవత్సరాలపాటు నిర్వహించిన అధ్యయనంలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. బాగా పొడవున్న, లావుగావున్న వ్యక్తులు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండడం ఎంతో అవసరం. ఎప్పటికప్పుడు ఆరోగ్యం గురించి డాక్టర్లతో పరీక్ష చేయించుకుని ప్రోస్టేట్ క్యాన్సర్ గురించి తెలుసుకోవడం, తగిన విధంగా చికిత్స పొందడం తప్పనిసరి. పర్యావరణం విషయంలో చూపిస్తున్న నిర్లక్ష్యం కూడా అనారోగ్యాలకి కారణమవుతోంది. పరిసరాల పరిశుభ్రత, నియమబద్ధమైన జీవితం కొన్ని వ్యాధుల నుంచి విముక్తుల్ని చేస్తుంది.

-సమ్మెట

